అదనపు గదులకు మోక్షమెప్పుడో!

- పథకం పేరు మార్చి.. అమలును గాలికి వదిలేసి
- అసంపూర్తిగా 42 గదుల నిర్మాణం



పెదనిండ్రకొలను జెడ్పీస్కూల్లో నిలిచిన అదనపు గదుల నిర్మాణం



బావాయిపాలెం జెడ్పీస్కూల్లో నిలిచిన అదనపు గదుల నిర్మాణం

నిడమర్రు: వైఎస్సార్ సీపీ హయాంలో ప్రభుత్వ బడులు కార్పొరేట్‌ను తలదన్నేలా మౌలిక వసతులు సమకూరాయి. మనబడి నాడు – నేడు పథకంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా వసతులు కల్పించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిషు మీడియం బోధన మాత్రమే జరిగేది. అధికారం మారింది. పేదల చదువుపై వివక్ష ప్రారంభమైంది. గత సర్కారులో ఫేజ్–1 కింద నాడు – నేడు పథకంలో నియోజకవర్గంలో 95 పాఠశాలలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. ఫేజ్–2లో 84 పాఠశాలలను ఎంపిక చేసి అభివృద్ధి పనులు ప్రారంభించారు. అవసరమైన పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణాలను ఫేజ్–2లో గుర్తించి నిధులు కూడా మంజూరు చేశారు. పాఠశాలల ఖాతాల్లో గత ప్రభుత్వంలో విడుదల చేసిన నిధులు ఉన్నా, ప్రస్తుతం ఆ నిర్మాణాలు అన్ని అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. దీంతో విద్యార్థులకు ఉపాధ్యాయులు అసౌకర్యాల మధ్య తరగతులు నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది.

నాడు పనుల పరుగు

జగన్ సర్కారులో నాడు – నేడు పనులు పరుగులు పెట్టాయి. అనుకున్న సమయానికి అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం ప్రభుత్వ మారి 9 నెలలు గడుస్తున్నా నిధుల వినియోగంపై ఆంక్షలతో పనులు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో నిడమర్రు మండలంలో నాడు – నేడు పథకంలో 20 స్కూళ్లను ఎంపిక చేశారు. ప్రతి పాఠశాలలో అవసరమైన రిపేర్లుతోపాటు, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, స్వచ్ఛమైన తాగునీరు, విద్యుత్ సౌకర్యంతోపాటు ఫ్యాన్లు, ట్యూబ్‌లైట్లు వంటి తొమ్మిది సౌకర్యాల ఏర్పాటుకు రూ.2.51 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు పూర్తిచేశారు. ఫేజ్–2లో 9 సౌకర్యాల కల్పనకు 9 స్కూళ్లను ఎంపిక చేశారు. వీటితోపాటు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో నిర్వహిస్తున్న 6 అంగన్‌వాడీ భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారు. నిడమర్రు మండలంలో నాలుగు స్కూల్స్‌లో 12 అదనపు తరగతి గదుల నిర్మాణం ప్రారంభించారు. వీటన్నిటికీ మొత్తం రూ.2.28 కోట్లు నిధులు మంజూరు చేసి పనులు చేస్తున్నారు.

నిలిచిన నిర్మాణాలు

ఉంగుటూరు నియోజకవర్గంలో నాడు–నేడు పథకంలో అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. నిడమర్రు మండలం బువ్వనపల్లి యూపీకి రెండు, నిడమర్రు జెడ్పీహెచ్ స్కూల్‌కి ఒకటి, పెదనిండ్రకొలను జెడ్పీ స్కూల్‌కి 4, బావాయిపాలెం జెడ్పీస్కూకి 5 తరగతి గదులు. ఉంగుటూరు మండలం ఉంగుటూరు, రాచూరు, నారాయణపురం, కైకరం, కాగుపాడు, రావులపర్రు గ్రామాలోని జెడ్పీ స్కూల్స్‌కి రెండు అదనపు తరగతి గదుల చొప్పున, చేబ్రోలు ఉర్దూ స్కూల్‌కి ఒక అదనపు తరగతి గది మంజూరు చేశారు. గణపవరం మండలం కాశిపాడు, గణపవరం గర్ల్స్ జెడ్పీ స్కూల్స్‌కి రెండేసి చొప్పున, ముప్పర్తిపాడు స్కూల్‌కి, డీకేవల్లి స్కూల్స్‌కి ఒక్కొక్కటి చొప్పున, భీమడోలు మండలం గుండుగొలను, పూళ్ల జెడ్పీ స్కూల్స్‌కి 9 గదులు, అన్నేవారిగూడెం యూపీకి, ఆగడాలలంక జెడ్పీ స్కూల్స్‌కి, భీమడోలులో 4 స్కూల్స్‌కి ఒకటి చొప్పున అదనపు తరగతి గదులు మంజూరయ్యాయి. 2024 సంవత్సరంలో ఎన్నికల మందు మార్చి నెలలో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశిస్తూ నాటి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఆ నిధులను ఖర్చు చేయవద్దని ప్రధానోపాధ్యాయులకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో వీటి నిర్మాణాలకు సరిపడా నిధులు ఉన్నా. వినియోగించుకోని పరిస్థితిల్లో ఆ పేరెంట్ కమిటీలు ఉన్నట్టు చెబుతున్నారు.

అమలులో శ్రద్ధ అవసరం



నాడు – నేడు పథకం పేరును మనబడి – మన భవిష్యత్ పేరుగా మార్చి ప్రభుత్వం ప్రజలను ఏమార్చుతున్నట్టుంది. పథకాల పేరు మార్చడంలో ఉన్న శ్రద్ధ అమల్లో కూడా ఉండాలి. గ్రామాల్లో నాడు – నేడు పథకంలో మంజూరైన అదనపు తరగతి గదులను, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణాలు త్వరిత గతిన పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– కోడే కాశి, జెడ్పీటీసీ, నిడమర్రు

క్లుప్తంగా

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటం



గణపవరంలో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ గోపీమూర్తి

గణపవరం: ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, హామీలను అమలు చేసే వరకు ప్యాప్టో ఆధ్వర్యంలో దశలవారీ ఆందోళనలు చేస్తామని ఎమ్మెల్సీ బి.గోపీమూర్తి అన్నారు. గురువారం ఆయన గణపవరం ఉన్నత పాఠశాల, జూనియర్ కాలేజీల్లో అధ్యాపకులు, ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలన్నీ చెల్లించాలని, కొత్త పీఆర్‌సీ ఏర్పాటు చేయాలని, పాఠశాలల విలీనం ప్రక్రియలో ఉపాధ్యాయుల అభిప్రాయాల మేరకే ముందుకెళ్లాలని, ఉపాధ్యాయులపై పనిభారం తగ్గించి బోధనకు సమయం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం అర్ధవరం, కాశిపాడు, డి.కుముదవల్లి పాఠశాలలకు వెళ్లారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు విజయరామరాజు, సీనియర్ నాయకుడు హోతా ఆంజనేయులు, భవానీ ప్రసాద్, మండల బాధ్యులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు కార్యాచరణ



సమీక్షలో పాల్గొన్న ఎంపీపీ శ్రీలక్ష్మి, అధికారులు

ఉంగుటూరు: వేసవిలో మంచినీటి ఎద్దడి నివారణకు రూ.44.80 లక్షలతో కార్యచరణ ప్రణాళిక సిద్ధం చేశామని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి వెల్లడించారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమీక్షా సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. మంచినీటి సమస్య తలెత్తే గ్రామాలను గుర్తించామన్నారు. ఇప్పటికే డెల్టాలో 13, మెట్టలో ఆరు గ్రామాల్లో ఫిల్టరు బెడ్లలో ఇసుక మార్పిడి పనులు చేశామని, రూ.37.30 లక్షలు వెచ్చించి ఫిల్టరు బెడ్లు సిద్ధం చేశామని చెప్పారు. గోపీనాథపట్నంలో మంచినీటి బోరు వేశామన్నారు. గుళ్లపాడులో మరో బోరు వేశామని తెలిపారు. ఎంపీడీఓ రాజు మనోజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రామారావు, పీఆర్ ఏఈ కృష్ణమోహన్, తదితరులు పాల్గొన్నారు.

రామాలయం ఆధునికీకరణ



రామాలయంలో టైల్స్ పనులు చేస్తున్న దృశ్యం

దెందులూరు: మేధినరావుపాలెం గ్రామ సర్పంచ్ ఎం దుర్గా కుమారి రాజు రూ.3 లక్షలతో కొవ్వలివారిగూడెం రామాలయాన్ని ఆధునికీకరించారు. రామాలయం ప్రాంగణం మెరక, ప్రహరీ, ఆలయంలో టైల్స్ నిర్మాణం పనులు చేస్తున్నారు. దీంతో గురువారం కొవ్వలివారిగూడెం గ్రామస్తులు సర్పంచ్ దుర్గా కుమారి రాజును అభినందిస్తున్నారు.

పూళ్లలో 6 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భీమడోలు: పూళ్ల సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లను తొలగించి, లైన్ల మరమ్మతులు, కొత్త లైన్ల ఏర్పాటు నిమిత్తం ఈనెల 6వ తేదీ వరకు నిత్యం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు ఆపరేషన్లు ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. పూళ్ల, ఎంఎంపురం, కురెళ్లగూడెం, దుద్దేపూడిలతో పాటు ఇండస్ట్రియల్ ఫీడర్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేడు దెందులూరు మండలంలో..

దెందులూరు: స్థానిక సబ్ స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని ఈఈ అంబేద్కర్ తెలిపారు. దెందులూరు, సీతంపేట, సత్యనారాయణపురం, కొమరేపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి

దెందులూరు: రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం వెంకట్రావు అన్నారు. గురువారం ఏలూరులో వెంకట్రావుని రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షులు తలారి రామకృష్ణ కలిశారు. జిల్లాలో డీలర్ల సమస్యలను వివరించారు. అనంతరం రామకృష్ణ పోతునూరులో మాట్లాడుతూ డీలర్ల సమస్యలు పరిష్కారానికి ప్రణాళిక సిద్ధం చేసినట్టు తెలిపారు.

ఇంటర్వ్యూలకు 474 మంది హాజరు



నిడమర్రులో అభ్యర్థులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయకుమారి

నిడమర్రు: స్వయం ఉపాధి సోపానం పథకం 2024–25 లబ్ధిదారుల ఎంపికకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూలకు 474 మంది హాజరైనట్టు ఎంపీడీఓ విజయకుమారి తెలిపారు. మొత్తం 650 మంది దరఖాస్తు చేసుకోగా 176 మంది హాజరుకాలేదన్నారు. కాపు 51, బీసీ 38, ఇతర కార్పొరేషన్లు 11 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలకు క్రొవ్విడి, చానమిల్లి, సిద్దాపురం, నిడమర్రు, మందలపర్రు, గుణపర్రు గ్రామాల దరఖాస్తుదారులు హాజరైనట్టు ఎంపీడీఓ చెప్పారు.

ఇంటర్వ్యూలకు దెందులూరులో 43 మంది హాజరు

దెందులూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం స్వయం ఉపాధి పథకం దరఖాస్తు దారులకు ఎంపీడీఓ కె.శ్రీదేవి, ఏఓ భీమరాజు, గోదావరి గ్రామీణ బ్యాంకు, ఇండియన్ బ్యాంకు మేనేజర్లు, వెలుగు ఏపీఎం సురేష్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో 651 మంది దరఖాస్తుదారులకు 43 మంది హాజరయ్యారు. రుణాల మంజూరు విషయాన్ని ఎంపికైన వారికి తెలియజేస్తామని ఎంపీడీఓ చెప్పారు.

పుచ్చకాయలకు పెరిగిన డిమాండ్

- జోరుగా వ్యాపారం
- పెరిగిన ఉష్ణోగ్రతలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న పుచ్చకాయలు

దెందులూరు: ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం 8 గంటల నుంచే సూరీడు సుర్రుమంటున్నాడు. బయటకు రావాలంటేనే భయపడేలా ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోత, వేసవితాపం, దాహార్తితో ప్రజలు అల్లాడుతున్నారు. మార్చిలోనే వాతావరణం ఇలా ఉంటే మే నెలలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. 92 శాతం నీరుండే పుచ్చకాయలను స్వీకరించి ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందుతున్నారు. దీంతో వాటికి డిమాండ్ పెరిగింది. పుచ్చకాయల విక్రయాలు జోరందుకున్నాయి.

సైజ్ బట్టి ధర

దెందులూరు నియోజకవర్గంలో పుచ్చకాయల హోల్‌సెల్ వ్యాపారం జోరుగా సాగుతోంది. పుచ్చకాయలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. చిన్న చిన్ని దుకాణాలకు రిటైల్‌గా విక్రయిస్తున్నారు. తోపుడు బండ్లపైనా ఎక్కడికక్కడ పుచ్చ ముక్కలు విక్రయిస్తున్నారు. పుచ్చకాయ సైజును బట్టి కిలో రూ.50 చొప్పున, కాయ ఒక్కొక్కటీ రూ.100, రూ.150, రూ.200 వరకు ధర పలుకుతోంది. పుచ్చ ముక్కలు రూ.10, రూ.20 లెక్కన అమ్ముతున్నారు.

ఆరోగ్యానికి మేలు



పుచ్చకాయలో ఉండే 92 శాతం నీటి వల్ల శరీరానికి చల్లదనం చేకూరుతుంది. పోషకాలు కూడా ఎక్కువే. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపక శక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది, రక్తపోటు, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే పోషకాలు గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. వేషవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– పవన్, సీహెచ్‌సీ వైద్యాధికారి, దెందులూరు

వైభవంగా చల్లాలమ్మ సంబరం



ఆకట్టుకున్న శక్తి వేషాలు



వేంకటేశ్వర స్వామి కోలాట భజన

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మ సంబరం గురువారం రాత్రి బాణసంచా కాల్పుల నడుమ వైభవంగా నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ ఆశాదులు గరగనృత్యాలు చేశారు. శక్తి వేషధారుల డాన్సులు ఆకట్టుకున్నాయి. భూదేవి సమేత వేంకటేశ్వరస్వామితో కూడిన బృందం కోలాటం నృత్యాలు చేసింది. వేలాది మంది ప్రజలు పాల్గొని సంబరాన్ని తిలకించారు. చల్లాలమ్మవార్ని దర్శించుకున్నారు. సంబరం అనంతరం అమ్మవార్ని గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ చైర్మన్ సూరత్తుల శ్రీను తదితరులు పర్యవేక్షించారు.

బెల్ట్ షాపును తొలగించాలని ఫిర్యాదు



కోడూరుపాడులో ఏర్పాటు

భీమడోలు: కోడూరుపాడులోని గ్రామకంతం స్థలంలో జనావాసాల మధ్య బెల్ట్ షాపు నిర్వహిస్తున్నారని, వెంటనే దుకాణాన్ని తొలగించాలని గ్రామానికి చెందిన పూని దశరథరామారావు గురువారం భీమడోలు ఎక్సైజ్ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన దాసరి పెద్దిరాజు అనే వ్యక్తి గ్రామకంతంలోని స్థలంలో బడ్డీకొట్టు పెట్టి అందులో బెల్ట్ షాపును నిర్వహిస్తున్నాడని, దీని వల్ల కోడూరుపాడు, దుద్దేపూడి, అన్నేవారిగూడెం గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ గ్రామాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు ఈ షాపు మీదుగానే తమ గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుందని, అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మరుతుందని పేర్కొన్నారు. గ్రామకంతం స్థలాన్ని ఆక్రమించి బడ్డీ కొట్టు ఏర్పాటు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారుడు తెలిపారు. సంబంధిత అధికారులు పరిశీలించి బడ్డీ కొట్టును తొలగించి, బెల్ట్ షాపును నిర్వహించకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఎక్సైజ్ అధికారి శివధారను వివరణ కోరగా బెల్ట్ షాపును నిర్వహిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్ దుకాణాన్ని నిర్వహిస్తున్నదీ లేనిదీ సిబ్బందితో పరిశీలన చేయించి, తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రీసర్వేకు సహకరించండి

దెందులూరు: భూముల రీ సర్వేకు సహకరించాలని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ రవిచంద్ర రైతులను కోరారు. గురువారం రామారావుగూడెం గ్రామ సచివాలయం వద్ద రీ సర్వే పై గ్రామసభ నిర్వహించారు. రీ సర్వేకు రైతులు ఆధార్, బ్యాంకు బుక్, ఫోన్ నెంబర్, పాసుబుక్, రెండు ఫొటోలు తీసుకురావాలని అన్నారు. మండల సర్వే రమణారావు, రైతులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జాబ్‌మేళా

ఉంగుటూరు: నారాయణపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు తెలిపారు. దివీస్ లాబరేటరీ వారు నిర్వహించే ఈ మేళాకు బీఎస్సీ కెమిస్ట్రీ, బీఫార్మసీ, ఎం ఫార్మసీ, బీటెక్ కెమికల్, ఇంజినీరింగ్, ఎంఎస్సీ ఆర్గానిక్ ఎనలిటికల్ కెమిస్ట్రీ చదివని వారు అర్హులని నేషనల్ కెరియర్ సర్వీసు అధారిటీ

నేడు ఆటో డ్రైవర్ల చలో కలెక్టరేట్



ప్రచార యాత్రలో పాల్గొన్న ఆటో డ్రైవర్లు.

ఏలూరు (టూటౌన్): రాపిడో, ఉబర్, ఓలా సంస్థల వాహనాలను వ్యతిరేకిస్తూ ఆటో డ్రైవర్లు ఈ నెల 4న నిర్వహించే చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ఆటో స్టాండ్‌లలో ప్రచార యాత్ర నిర్వహించారు. గురువారం ఉదయం పాత బస్టాండ్ సెంటర్ నుంచి ప్రచార యాత్ర బయలుదేరింది. కార్యక్రమంలో ఏలూరు జిల్లా ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి జె.గోపి మాట్లాడారు. ఏలూరులో దాదాపు 5 వేల మంది ఆటో డ్రైవర్లు ఉన్నారని తెలిపారు. ఆటో స్టాండ్‌ల వద్ద కిరాయిలు వచ్చే సమయానికి రాపిడ్ వంటి సంస్థల వాహనాలు ప్రయాణికులను తరలించుకుపోవడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు ఆదాయాన్ని సమకూరుస్తున్న ఆటో డ్రైవర్లకు, వారి కుటుంబాలకు రక్షణ చేకూరేలా సమగ్ర సంక్షేమ చట్టాన్ని (వెల్ఫేర్ బోర్డు) ఏర్పాటు చేయాలని ప్రభుతాన్ని కోరారు. ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఆటో స్టాండ్‌లకు షెల్టర్‌తో కూడిన పార్కింగ్ స్టాండ్లను ఏర్పాటు చేయాలని, ఆటోల కొనుగోలుకు సబ్సిడీతో కూడిన రుణాలను ఇవ్వాలని కోరారు. ప్రచార యాత్రకు అడ్డాల రాజు (నాని), బి.చంద్రశేఖర్, చక్రాల అమర్ కుమార్, వై.బాలాజీ, ఇ.విజయ్ కుమార్ నాయకత్వం వహించగా పెద్ద సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

అనంతకోటి సేవల రాజు

- గణప'వరం' వేగేశ్న ఫౌండేషన్
- జన్మభూమి రుణం తీర్చుకుంటున్న ప్రవాసాంధ్రుడు



వేగేశ్న అనంతకోటిరాజు

గణపవరం: అమెరికాలో వ్యాపారంలో స్థిరపడిన గణపవరానికి చెందిన వేగేశ్న అనంతకోటిరాజు రాజా వేగేశ్న ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి తన తండ్రి వేగేశ్న ఏసుదాతరాజు, సోదరుడు ఆనందరాజుల సహకారంతో స్వగ్రామానికే కాదు, మన రాష్ట్రంలోనూ, దేశంలోనూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ.260 కోట్ల విలువైన సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో ఒక్క గణపవరంలోనే రూ.37 కోట్లు సేవా కార్యక్రమాలకు వినియోగించారు.

గణపవరానికి సేవలు ఇలా..

2005వ సంవత్సరంలో ఇందిరమ్మ కాలనీ ఏర్పాటుకు ఫౌండేషన్ తరఫున రూ.50 లక్షలు అందజేశారు. ఇందిరమ్మ మోడల్ కాలనీ ప్రారంభోత్సవంలో నాటి సీఎం వైఎస్సార్ దాతలను అభినందించి సన్మానించారు. గణపవరంలో రూ.20 లక్షలతో ఆర్‌ఓ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేశారు. రూ.25 లక్షలతో శ్మశాన వాటికను అభివృద్ధి చేశారు. దండు మారెమ్మ, సువర్ణేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి రూ.50 లక్షలు అందించారు. బొబ్బిలి వంతెన దిగువున రూ.60 లక్షలతో వెంకటేశ్వరస్వామి ఆలయం, కల్యాణ మండపాలను నిర్మించారు. క్రైస్తవ ఆలయాలు, దళిత వాడల్లో రామాలయాల అభివృద్ధికి, బాలుర హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అదనపు గదుల నిర్మాణాలకు నిధులు అందించారు. కల్లిగొట్ల వద్ద వెంకయ్య కాల్వపై రూ.25 లక్షలతో వంతెన నిర్మించారు. గణపవరం దళితపేట చెర్వు అభివృద్ధికి రూ.6 లక్షలు, పంచాయతీలో చెత్త సేకరణకు రెండు ట్రాక్టర్ల కొనుగోలుకు రూ.15 లక్షలు అందించారు. గణపవరం ప్రాథమిక పాఠశాల అదనపు గది, ప్రహరీ ఏర్పాటుకు రూ.15 లక్షలు అందించారు. గణపవరంలో సువర్ణగుండం చెర్వు వద్ద ఐదెకరాల్లో, జగన్నాథపురంలో మూడెకరాల్లో మంచినీటి చెర్వులను తవ్వారు. ఈ భూమి మార్కెట్ ధర ప్రకారం రూ.30 కోట్లు పైమాటే.



వేగేశ్న ఫౌండేషన్ దాతృత్వంతో ఏర్పడిన ఇందిరమ్మ కాలనీ



ఏసుదాతరాజును సత్కరిస్తున్న మాజీ సీఎం వైఎస్సార్



మంచినీటి చెర్వుకు ఇచ్చిన భూమి



ఫౌండేషన్ అభివృద్ధి చేసిన శ్మశాన వాటిక

రాష్ట్ర వ్యాప్తంగా సేవలు

తిరుమల తిరుమలలో తరిగొండ వెంగమాంబ నిత్యాన్న దాన సత్రం నిర్మాణానికి రూ.25 కోట్లు, భక్తుల విశ్రాంతి భవనం, ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ.15 కోట్లు వెచ్చించారు. తిరుమలలో ఏటా జలప్రసాద వితరణకు రూ.5 కోట్లు ఖర్చు చేస్తున్నారు. యాదగిరి గుట్ట లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వద్ద అన్నదాన కాంప్లెక్స్ నిర్మాణానికి, అన్నదానానికి రూ.15 కోట్లు, మహారాష్ట్రలోని షిర్డీసాయి మందిరంలో మంచినీటి సదుపాయానికి రూ.50 లక్షలు విరాళంగా ఇచ్చారు. శ్రీశైలం, అన్నవరం, సింహాచలం, విజయవాడ కనకదుర్గ తదితర పుణ్యక్షేత్రాల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను, భక్తుల విశ్రాంతి గదులను నిర్మించారు. పలు రైల్వే స్టేషన్లలో వాటర్‌ప్లాంట్స్ ఏర్పాటు చేశారు. ద్వారకాతిరుమలలో రూ.10 కోట్లతో ఆస్పత్రి విర్డ్‌ను నిర్మించి వికలాంగులకు ఖరీదైన వైద్యసేవలు ఉచితంగా అందిస్తున్నారు.

నేడు ప్రారంభోత్సవాలు

గణపవరంలో రాజు వేగేశ్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో తవ్విన ఐదెకరాల మంచినీటి చెర్వు, జగన్నాథపురం చినరామచంద్రపురం ప్రాంతాల మంచినీటి అవసరాలకు తవ్విన మూడెకరాల మంచినీటి చెర్వులు, జగన్నాథపురంలో ఆర్‌ఓ మినరల్ వాటర్ ప్లాంట్, గాంధీ చెర్వు చుట్టూ నిర్మించిన ప్రహరీలను శుక్రవారం ప్రారంభించి, గ్రామ పంచాయతీకి అప్పగించనున్నారు. జగన్నాథపురం ప్రాథమిక పాఠశాలలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాల్లో రాజు వేగేశ్న ఫౌండేషన్ చైర్మన్ వేగేశ్న అనంతకోటిరాజు, శాసనసభ ఉపసభాపతి కనుమూరు రఘురామకృష్ణంరాజు, మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంపీ పుట్టామహేష్, ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గోనున్నారు.

నేడు భూ రీసర్వేపై అవగాహన

భీమడోలు: గుండుగొలను సచివాలయం–2 వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు భూ రీసర్వేపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్టు వీఆర్వో డి.సింహాచలం తెలిపారు. రైతులంతా హాజరుకావాలని కోరారు.

అర్జీదారుల్లో నిరాశ

భీమడోలు ఎంపీపీ సమావేశ మందిరంలో గురువారం 11 గ్రామ పంచాయతీలకు చెందిన దరఖాస్తుదారులకు ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి ఇంటర్వ్యూలు నిర్వహించారు. పూళ్ల, గుండుగొలను, సూరప్పగూడెం, కోడూరుపాడు, దుద్దేపూడి, పోలసానిపల్లి, ఆగడాలలంక, చెట్టున్నపాడు, లక్ష్మీపురం, కురెళ్లగూడెం గ్రామాలకు చెందిన 405 మంది హాజరయ్యారు. తమ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి పంపేశారని, ఎవరు ఎంపికయ్యారు, రుణాలు ఎప్పుడు ఇస్తారో స్పష్టత ఇవ్వలేదని దరఖాస్తు దారులు నిరాశతో వెనుదిరిగారు. గత నెల 28న భీమడోలు, అంబర్‌పేట గ్రామాలకు చెందిన 488 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. వారంతా తమకు రుణాల మంజూరు కష్టమేనని చెబుతున్నారు.